క్లుప్తంగా

మైనారిటీ ఉద్యోగుల కమిటీ ఎన్నిక



హబీబ్ అల్లాబేగ్, అధ్యక్షుడు

కొత్తగూడెంరూరల్: రాష్ట్ర మైనారిటీ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా హబీబ్ అల్లాబేగ్ ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ ఫరూక్ అహ్మద్ ఆదేశాల మేరకు లక్ష్మీదేవిపల్లి మండలంలోని రైతు వేదికలో జిల్లా కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా హబీబ్ అల్లాబేగ్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ ముంతాజ్ అలీ, కోశాధికారిగా షేక్ యాకుబ్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎండీ గౌస్ పాషా, ఉపాధ్యక్షుడిగా ఎండీ యాకుబ్‌పాషా, జానిమియా, మహిళా ఉపాధ్యక్షురాలిగా రఫీయా సుల్తాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా షేక్ రెహానా, ముస్తఫా, సీహెచ్ సుధాకర్, ఎంఎస్ ఖాన్, గౌరవ సలహాదారుడుగా ఎండీ యాకుబ్‌పాషాలను ఎన్నుకున్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్/సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో కొత్తగూడెం విద్యార్థులు ప్రతిభ చాటారు. శని, ఆదివారాల్లో భూపాలపల్లి జిల్లాలో నిర్వహించిన ఈత పోటీల్లో కొత్తగూడెం నవభారత్ పాఠశాలకు చెందిన కొట్టి సాయిశ్రీ వాత్సవ్‌కు బ్యాక్ స్ట్రోక్ 200 మీటర్ల, బ్రెస్ట్ స్ట్రోక్ 200 మీటర్ల విభాగంలో 2 కాంస్యాలు, బండారి నాగ చైతన్య బటర్‌ఫ్లై 200 మీటర్ల విభాగంలో కాంస్యం, సెంట్ జోసెఫ్ పాఠశాలకు చెందిన ఛత్రపతినాథ్ రజత పతకం సాధించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను నవభారత్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎంవీఎస్ రెడ్డి, సెయింట్ జోసెఫ్ స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ రాజశేఖర్‌రెడ్డి, సీఈఆర్ క్లబ్ స్విమ్మింగ్ పూల్ కోచ్‌లు అభినందించారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి..



మాట్లాడుతున్న సారంగపాణి

ఇల్లెందురూరల్: హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ ప్రగతిశీల హమాలీ అండ్ మిల్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సారంగపాణి విమర్శించారు. చల్లసముదరం క్యాంపు సెంటర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన హమాలీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యం బరువులు మోస్తూ సమాజానికి అవసరమైన సరుకులను దిగుమతి, ఎగుమతి చేస్తున్న హమాలీ కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని, ఎన్నికల ముందు వారికి ఇచ్చిన హామీలను విస్మరిస్తోందని ఆరోపించారు. 50 సంవత్సరాలు దాటిన హమాలీలు నడుము నొప్పులు, ఒళ్లు నొప్పులు, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నారని వాపోయారు. వీరికి పెన్షన్ ఇవ్వాలని, పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరారు.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి



మాట్లాడుతున్న వనమా వెంకటేశ్వరరావు

కొత్తగూడెంఅర్బన్: కులమతాలకు అతీతంగా కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులతో సంతోషంగా ఉండాలని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం కొత్తగూడెం పట్టణంలోని జమా మసీద్‌లో జరిగిన గార్మి కార్యక్రమానికి హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. కమిటీ చైర్మన్ రజాక్, అధ్యక్షుడు కరీం, కమిటీ సభ్యులు అన్వర్ పాషా, సాధిక్ పాషా, యాకుబ్ ఖాద్రీ, గౌస్ మైనుద్దిన్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

సుజాతనగర్: సీతంపేట గ్రామ పంచాయతీ రాంజీతండా గ్రామానికి చెందిన పేద విద్యార్థి భూక్యా వసంత్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఖాళీ సమయాల్లో ట్రాక్టర్ నడుపుతూ డిగ్రీ చదువుకుంటున్నాడు. స్పందించిన గ్రామస్తులు ఇంటింటా తిరిగి చందాలు అడిగి ఆదివారం రూ.30 వేల ఆర్థిక సాయం అందించారు. దాతలు స్పందించాలని కోరుతున్నారు.

అనుమతులు ఎప్పుడిస్తారో?

- ఏళ్లుగా ఇసుక అక్రమ రవాణా
- అధిక ధరలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- ఆన్‌లైన్‌లో ఇసుక లేక అవస్థలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి



మొర్రేడు వాగు నుంచి ఇసుకను అక్రమంగా ట్రాక్టర్లలో తరలిస్తున్న దృశ్యం(ఫైల్)

పాల్వంచ: ఒకవైపు అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా సాగుతోంది. నిత్యం వందలాది ట్రాక్టర్లు, లారీల్లో ఇసుక దందా నిర్వహిస్తున్నారు. ఇందుకు ఒకవైపు అధికారుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. అక్రమ రవాణా వల్ల ఇసుక ధర అమాంతం పెరిగింది. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలపై భారం పడుతోంది. ఆన్‌లైన్ ద్వారా తక్కువ ధరకు దొరికే ఇసుక ఇప్పుడు లేకుండా పోయింది. ర్యాంప్‌లు లేకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికీ భారీగా గండి పడింది. మరోవైపు భవన నిర్మాణ రంగంపై ప్రభావం పడి పనులు లేక అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అరకొర పనులతో చేతి నిండా పనులు దొరకడం లేదు. ఇక అనేక మంది ట్రాక్టర్ ఓవర్లు, డ్రైవర్లు ఇసుక రవాణాకు అలవాటు పడి దురాశతో అక్రమ రవాణాకు పాల్పడుతూ కేసుల పాలవుతున్నారు. దీంతో వారి కుటుంబాలు సైతం కేసులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. కొందరిపై రౌడీ షీట్లు కూడా నమోదై సంఘ విద్రోహ శక్తులుగా ముద్రపడుతున్నారు. ఇసుకను అక్రమంగా మొర్రేడు వాగు, కిన్నెరసాని పరివాహక ప్రాంతాల నుంచి తరలిస్తున్నారు. అయితే అధికారుల కన్నుగప్పి ఇసుకను తేవాల్సి వస్తుండటంతో ఇళ్ల యజమానులకు సకాలంలో అందడం లేదు. అంతేగాక అడ్డగోలుగా ధరలు పెంచుతున్నారు. అధికారులకు, అడ్డుకునే వారికి ముడుపుల వల్లే ధర పెరిగిందని సెలవిస్తున్నారు. అయితే ప్రభుత్వమే ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసి తక్కువ ధరకు అందించాలన్న డిమాండ్ వ్యక్తం అవుతుండగా ప్రభుత్వం, అధికారులు మాత్రం ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంపై సర్వాత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నారు. ఇసుక దందా వల్ల కొన్ని శాఖల అధికారుల జేబులు నిండుతాయే తప్ప, ఇసుకను అధిక ధరలకు కొనడం పేద, మధ్య తరగతి వర్గాలపై ఆర్థిక భారం పడుతోంది.

అమాంతం పెరిగిన ఇసుక ధర...

పాల్వంచ చుట్టూ కిన్నెరసాని, మొర్రేడు పరివాహక ప్రాంతాలు ఉన్నాయి. పాల్వంచ సరిహద్దు ములకపల్లి మండలంలో గుర్రాలకుంట, రంగాపురం, తిమ్మంపేట, ములకలపల్లి, పాల్వంచ మండల పరిధిలో కుంటినాగుల గూడెం, నాగారం, రంగాపురం, ఎర్రగుంటలలో ఇసుక ర్యాంప్‌లను ఏర్పాటు చేశారు.

కొంతకాలం ఇసుక ర్యాంపులు నడిచినా కొన్ని నెలలుగా ర్యాంప్‌లకు అనుమతులు ఇవ్వడం లేదు. దీంతో అక్రమ ఇసుక రవాణా సాగుతోంది. దీంతో పోలీసు, రెవెన్యూ, ఫారెస్ట్, మైనింగ్ అధికారులు తరచు ఇసుక ట్రాక్టర్‌లను, లారీలను పట్టుకుంటున్నారు. అక్రమ డంపింగ్‌లు ఏర్పాటు చేసుకుని అక్రమార్కులు దండుకుంటున్నారు. దీంతో ఇసుక ధరలు సైతం అమాంతం పెరిగాయి. ట్రాక్టర్ ఇసుక రూ.1,500 ఉండగా ఇప్పుడు రూ.2వేల నుంచి ఏరియాలను బట్టి రూ.4వేల వరకు పలుకుతోంది. దీంతో ఇల్లు కట్టుకుంటున్న పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు వర్ణనాతీతం. భవన నిర్మాణాలు బాగుంటే అనేక రకాల చేతి వృత్తిదారులకు పని దొరుకుతుంది. కానీ ఇసుక అధిక ధరల వల్ల నిర్మాణాలు తగ్గుతుండటంతో వివిధ వర్గాల పనివారు ఇబ్బంది పడుతున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి..

ప్రభుత్వాలు మారుతున్నా వ్యవస్థలో అక్రమ వ్యవహారాలు మాత్రం మారడం లేదు. అక్రమార్కులను పెంచిపోషిస్తున్న విధానాలు గాడిన పడడం లేదు. దీనివల్ల ఇష్టారాజ్యంగా నడిచే అక్రమ వ్యాపారాలు అధికారులకు మాత్రమే కలిసొస్తోంది. జిల్లాలోని పలు పట్టణాలు, మండలాలు ఇప్పుడిప్పుడే అభివృద్ధిలో పయనిస్తున్నాయి. ఈ క్రమంలో ఇసుక కీలకంగా మారింది. ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసి దాని ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వం పొందితే మరిన్ని అభివృద్ధి ఫలాలు అందే అవకాశం ఉంటుంది. జిల్లా నుంచి ముగ్గురు మంత్రులున్నా ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయకపోవడంతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడకపోగా ప్రభుత్వ ఆదాయానికి మాత్రం దెబ్బ పడుతోంది. దీనిని పరిష్కరించాలని ఏళ్ల తరబడ కోరుతున్నా పట్టించుకున్న నాథుడు కరువయ్యారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి..



ఇసుక ర్యాంప్‌లు లేకపోవడంతో ఇసుక ధర పెరిగింది. కిన్నెరసాని, మొర్రేడు వాగు పరివాహక ప్రాంతాలు ఉన్నా ఇసుక దొరకడం లేదు. ఇది నిర్మాణ రంగంపై ప్రభావం చూపుతోంది. దొడ్డిదారిని అధిక ధరలకు అమ్ముతుండటంతో పేద, మధ్య తరగతి ప్రజలు పనులు చేయించడం లేదు. ర్యాంప్‌లు తెరిస్తే అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుంది.

– ధరావత్ గోపి, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు

అక్రమ రవాణా జరుగుతోంది..



ఇసుక ర్యాంపులు లేని కారణంగా అక్రమ ఇసుక యథేచ్ఛగా సాగుతోంది. దీని వల్ల ఇసుక ధర అధికంగా పెరిగింది. ఇళ్లు కట్టాలంటే ముందుగా ఇసుక ముఖ్యం. పల్లెటూర్లలో అయితే ఇసుక అసలే దొరకడం లేదు. దూర గ్రామాలకు ట్రాక్టర్లలో ఇసుక తరలించాలంటే ధర భరించలేక పోతున్నారు. అధికారులు ర్యాంపులు తెరిస్తేనే సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

– నరేష్, పాల్వంచ

కమిటీ నిర్ధారణ చేయాలి...



రెవెన్యూ, మైనింగ్, పోలీస్, ఫారెస్ట్ శాఖల ఆధ్వర్యంలో ఇసుక ర్యాంపుల కమిటీని ఏర్పాటు చేయాలి. వారి సూచనల మేరక ఇసుక నిల్వలు, తరలింపుపై ప్రాథమిక నిర్ధారణకు రావాలి. అయితే ఈ ర్యాంప్ ఒక సంవత్సర కాల పరిమితికి మాత్రమే ఇస్తుంటారు. ఒకసారి ఇచ్చిన చోటే మళ్లీ ఇవ్వడం కష్టం. మరోచోట ఏర్పాటు చేయాలంటే ఉన్నత స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

– వివేక్, తహసీల్దార్, పాల్వంచ

బొగ్గు వెలికితీత పనులు చేపట్టండి..



జీఎం కృష్ణయ్యతో మాట్లాడుతున్న నాయకులు

ఇల్లెందు: నూతనంగా చేపట్టబోవు జేకే ఓసీ బొగ్గు వెలికి తీసే పనులను సింగరేణి చేపట్టాలని ఏఐటీయూసీ నేతలు మిర్యాల రంగయ్య, కె.సారయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో ప్రైవేట్ కాంట్రాక్టర్‌తో కాకుండా సింగరేణి ద్వారా వెలికి తీసే చర్యలు చేపట్టాలని, నిర్వాసితులకు తగిన ప్యాకేజీ అందించాలని కోరారు. ప్లాట్లు కేటాయించాలని, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందరికీ అందేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇల్లెందు ఏరియాలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం ఏరియా నూతన జీఎం వీసం కృష్ణయ్యను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్, దాసరి రాజారామ్, బ్రాంచి సహాయ కార్యదర్శి కొంగర వెంకటేశ్వర్లు, ముస్తాఫా, కొరిమి సుందర్, దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, గుగులోతు కృష్ణ, లచ్చిరామ్, యుగంధర్, శ్రీనివాస్, బొల్లెద్దుల శ్రీనివాస్, తిరుమలరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆస్పత్రికి ఏర్పాట్లు

సాక్షి ఎఫెక్ట్..

చుంచుపల్లి: జిల్లాలోని నాలుగు డిపోల పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ సిబ్బందికి దశాబ్దాలుగా వైద్య సేవలు అందడం లేదని స్థానికంగా ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని గత మంగళవారం 'వైద్య సేవలు ఎప్పుడో..?' అనే కథనాన్ని సాక్షిలో ప్రచురితం అయింది. వెంటనే స్పందించిన అధికారులు ఆస్పత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. కొత్తగూడెం బస్టాండ్ ప్రాంగణంలోని పాత స్కాడ్ భవనానికి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నారు. అతి త్వరలో ఆస్పత్రిని అందుబాటులో తేనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

'సీతారామ' నీళ్లు వచ్చే వరకూ పోరాటం



పాదయాత్రగా భద్రాచలం బయలుదేరిన సేవాలాల్ సేన నాయకులు, కార్యకర్తలు

టేకులపల్లి: వెనుకబడిన గిరిజన జిల్లా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు సీతారామ ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు అందించాలని, సామాజికంగా, ఆర్థికంగా, గిరిజనులపై జరుగుతున్న భౌతిక దాడులను అరికట్టాలని, గిరిజన చట్టాలను అమలు చేయని పాలకుల కుట్రలను మానుకోవాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు మాలోతు శివ నాయక్ అన్నారు. ఈ మేరకు సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీళ్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు ఇవ్వాలనే ప్రధాన డిమాండ్‌తో శనివారం ఇల్లెందులో ప్రారంభమైన ఇల్లెందు–భద్రాచలం పాదయాత్ర రెండో రోజు ఆదివారం టేకులపల్లి నుంచి ప్రారంభమైంది. సోమవారం సాయంత్రం 4 గంటలకు భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం వద్ద ఈ పాదయాత్ర ముగియనుంది. శివ నాయక్ మాట్లాడుతూ.. ఏజెన్సీ జిల్లాకు రావాల్సిన గోదావరి నీళ్లను వేరే ప్రాంతాలకు తరలించడం దారుణమన్నారు. 5, 6వ షెడ్యూల్డ్ గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, జీఓ 3ని పునరుద్ధరించాలని, వంద శాతం అవకాశాలు ఏజెన్సీ గిరిజనులకు కల్పిస్తూ చట్టభద్రత కల్పించాలని, నూతన తండా, పంచాయతీలను రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించాలని, పంచాయతీలో ఉన్న అన్ని శాఖల ఉద్యోగాలు గిరిజనులతోనే భర్తీ చేయాలని, కోల్ బెల్ట్ ఇండస్ట్రియల్ ఏరియాలలో ప్రభుత్వ క్యాన్సర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇస్లావత్ నామానాయక్, ధరావత్ కృష్ణ నాయక్, పూల్‌సింగ్, జరుపుల లచ్చు వంశీ, రాజ్‌కుమార్, దేవ్‌సింగ్ పాల్గొన్నారు.

గ్రామపంచాయతీల్లో క్రీడాపోటీలు

ఇల్లెందురూరల్: ప్రజాపాలన ఏడాది విజయోత్సవాలలో భాగంగా మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం క్రీడా పోటీలు నిర్వహించారు. యువకులు తమకు ఆసక్తి ఉన్న క్రీడా పోటీలలో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబర్చారు. పంచాయతీ స్థాయిలో నిర్వహించిన పోటీలలో ప్రతిభ చూపిన క్రీడాకారులను జట్టుగా ఎంపిక చేసి మండల స్థాయి పోటీలకు పంపుతామని పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. గ్రామాలలో పోటీలను ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి పరిశీలించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



1991-92 పదో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు,

పాల్వంచ: పట్టణంలోని బొల్లేరుగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1991–92లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం వాసవీ బ్లాంకెట్ హాల్‌లో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఒకరి యోగక్షేమాలు ఒకరు అడిగి తెలుసుకుని ఉత్సాహంగా గడిపారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి ప్రధానోపాధ్యాయులు శ్రీరాములు, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, సాంబశివరావు, గుణసుందరి, శ్రీనివాసరావు, హరి, పద్మజలను సన్మానించారు. సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఏనుగుల శ్రీను, తాటికొండ సురేష్, రాజశేఖర్, భానుమూర్తి, నాగరాజు, అమిత్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



మొక్కంపాడులో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

టేకులపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో పక్కా రోడ్ల నిర్మాణమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఈ మేరకు ఆదివారం రూ.1.63 కోట్లతో మండలంలోని పాత తడికలపూడి, స్టేషన్ తడికలపూడి, ముత్యాలంపాడు క్రాస్‌రోడ్, సులానగర్, చింతలంక, బిల్లుడు తండా, తొమ్మిదోమైలు తండా, బేతంపూడి, సామ్యాతండా, బోడు, పాతర్లగడ్డ, మొక్కంపాడు గ్రామాలలో నిర్మాణం చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైయినేజీలు, సులానగర్‌లో లోలెవెల్ బ్రిడ్జికి శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో కోరం సురేందర్, భూక్యా దేవా, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జిల్లా నాయకుడు కోరం సురేందర్, మండల అధ్యక్షుడు భూక్య దేవా, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల నాయకులు రెడ్యానాయక్, ఈది గణేష్, మోకాళ్ల పోశాలు, బండ్ల రజిని, మధురెడ్డి, శంకర్, ఖాదర్‌బాబు, శివ, భద్రు, రవి, సర్దార్, పూర్ణ, మౌనిక, బండ్ల శ్రీను, నర్సింగ్‌లక్ష్మయ్య, ఉదయ్, రాసమల్ల, తదితరులు పాల్గొన్నారు.

హామీలు నిలబెట్టుకోవాలి



మాట్లాడుతున్న దిండిగల రాజేందర్

కొత్తగూడెంఅర్బన్/టేకులపల్లి: ఎన్నికల ముందు సమగ్రశిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.హరిలాల్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం సమగ్రశిక్ష ఉద్యోగులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించి ఉద్యోగులకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాలు క్రమం తప్పకుండా ఇవ్వాలని, ఉద్యోగులకు పేస్కేల్ ఇవ్వాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు. అనంతరం గ్రంథాలయ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్ దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని, అందులో భాగంగానే సమగ్ర శిక్ష ఉద్యోగులు కూడా హనుమకొండలో ఇచ్చిన హామీని నమ్మి మోసపోయారని విమర్శించారు. గత సంవత్సరం సెప్టెంబర్‌లో ఇదే సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్షా శిబిరానికి విచ్చేసిన రేవంత్ రెడ్డి... మేము అధికారులకు వచ్చిన 100 రోజుల లోపే ఉద్యోగులను సచివాలయానికి పిలిపించి సమస్య పరిష్కరిస్తామని విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వి.సరియా, ప్రసాదరావు, భట్టు చందర్‌లాల్, పి.సిద్ధయ్య, వనమా సురేష్, కేజీబీవీ బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

13న 'చలో అసెంబ్లీ'



మాట్లాడుతున్న సతీష్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల సాధనకై ఈనెల 13న తలపెట్టిన చలో అసెంబ్లీని జయప్రదం చేయాలని ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కొత్తగూడెం రీజియన్ అధ్యక్షుడు పెద్దబోయిన సతీష్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెంలో జరిగిన యూనియన్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల శ్రమదోపిడీకి గురవుతున్నారని, వంద సంవత్సరాల చరిత్ర కలిగిన సింగరేణి సంస్థలో కాంట్రాక్ట్ కార్మికులతో పెట్టి వెట్టి చాకిరీ చేయిస్తున్నారని, పనికి తగ్గ వేతనం ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈనెల 9 నుంచి జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో కోల్ బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు కార్మికుల వేతనాల పెంపుదలకై మాట్లాడాలని ముఖ్యమంత్రిని ఒప్పించాలని కోరారు. సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికుల పట్ల సవతి తల్లి ప్రేమను కనబరుస్తున్నాయని విమర్శించారు. జీఓ నంబర్ 22ను తక్షణమే గెజిట్ చేసి వేతనాలు పెంచే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని ఖాళీగా ఉన్న కంపెనీ క్వార్టర్లను కార్మికులకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాగమ్మ, వై.గోపాలరావు, కృష్ణ, చంద్రశేఖర్, మల్లేష్, వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్

ఇల్లెందు: ఈ నెల 13న చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం ఇల్లెందు ఇఫ్టూ కార్యాలయంలో మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించటంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. మల్టీ పర్పస్ విధానం రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సారంగపాణి, సామేల్, మోహన్‌రావు పాల్గొన్నారు. ఈ నెల 13న జరుగు చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతం చేయాలని టీయూసీఐ జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలీ కోరారు. అదే విధంగా హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సారంగపాణి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న ప్రసాద్

దశాబ్దాలుగా ప్రజాసేవలో...



మాట్లాడుతున్న ఖాలీద్ ముబషిర్

కొత్తగూడెంఅర్బన్: జమైతే ఇస్లామీ హింద్ 75 సంవత్సరాలుగా ప్రజాసేవలో ఉందని నిరుపేదలకు సాయం చేయడం, బాధితులకు ఉపశమనం కలిగించడం, వితంతువులకు ఆర్థిక సాయం, అనాథలు, నిరాశ్రయులైన పిల్లల చదువులు వంటి అనేక ప్రజా సంక్షేమ కార్యకలాపాలను నిర్వహిస్తోందని రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఖాలీద్ ముబషిర్ తెలిపారు. ఆదివారం కొత్తగూడెంలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో క్లీనిక్‌లు, మల్టీ–స్పెషాలిటీ ఆస్పత్రులు నడుపుతోందని, ఇందులో పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందించడం జరుగుతోందన్నారు. తెలంగాణలోని వివిధ ప్రదేశాలలో విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఉచితంగా అందిస్తోందని వివరించారు. అదేవిధంగా జమైతే ఇస్లామీ హింద్ సమాజంలో చెడును నిర్మూలించడానికి, సన్మార్గాన్ని ప్రోత్సహించడానికి ప్రయత్నిస్తోందని చెప్పారు. దీంతో పాటుగా వక్ఫ్ (సవరణ) బిల్లు 2024 విషయంలో జమైతే ఇస్లామీ హింద్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో నయిముద్దీన్, ఫసివుల్లా, షారుఖ్‌యజ్దాని, షేక్ అబ్దుల్ బాసిత్, షేక్ జహంగీర్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించండి..

- ఎంసీహెచ్, జీజీహెచ్‌లో ఇబ్బంది పడుతున్న గర్భిణులు
- చేసేది లేక ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్న వైనం



కొత్తగూడెంలోని మాతాశిశు సంరక్షణ కేంద్రం

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రంలోని మాతాశిశు సంరక్షణ కేంద్రం, జిల్లా సర్వజన ఆస్పత్రిలో నాలుగు నెలలుగా రేడియాలజిస్ట్ లేకపోవడంతో గర్భిణులకు స్కానింగ్ తీయటం లేదు. దీంతో దూరప్రాంతాల నుంచి ఇక్కడి వస్తున్న గర్భిణులను ఇబ్బందులు తప్పడం లేదు. ఆగస్టులో రేడియోలజిస్ట్ వైద్యులు, సీనియర్ రెసిడెన్సీలు బదిలీపై వెళ్లారు. దీంతో స్కానింగ్ గదికి తాళం పడింది. ఇక్కడికి వచ్చిన గర్భిణులను జిల్లా సర్వజన ఆస్పత్రికి తీసుకొచ్చి కొన్ని రోజులు స్కానింగ్ తీయించారు. ఇక్కడా అదే పరిస్థితి. రేడియోలజిస్ట్ బదిలీ... స్కానింగ్‌ను నిలిపివేశారు. ఈ రెండు ఆస్పత్రులలో అసౌకర్యాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆశా వర్కర్లు గర్భిణులను తీసుకొచ్చి వైద్య సేవలు చేయిస్తున్నప్పటికీ స్కానింగ్ లేకపోవడం వల్ల, వారిని పాల్వంచ, ఇల్లెందు ప్రభుత్వాస్పత్రులకు తీసుకెళ్లాల్సి వస్తోంది. గర్భిణులకు మూడో నెల, ఆరో నెల, ప్రసవం ముందు స్కానింగ్ తీయాల్సి ఉంటుంది. వారికి స్కానింగ్ తప్పనిసరి కావటంతో ప్రైవేట్ సెంటర్ల వద్ద స్కానింగ్ తీయించుకోవాల్సి వస్తోంది. దీనికి తోడు ఎంసీహెచ్ త్రీ ఇంక్లైన్ పంచాయతీలో ఉంది. రోడ్డు నుంచి ఆస్పత్రి అర కిలోమీటరు దూరంలో ఉంటుంది. గర్భిణులకు ఆటోలు, బస్సులు దిగిన తరువాత అర కిలోమీటరు నడిచి వెళ్లాల్సి వస్తోంది. ఎంసీహెచ్‌లో మినీ వాహనాలు ఏర్పాటు చేస్తే, గర్భిణులు ఆస్పత్రికి వెళ్లటానికి సులువగా ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నోటిఫికేషన్ ఇచ్చారు...



ఎంసీహెచ్, సర్వజన ఆస్పత్రుల్లో పని చేసేందుకు రెడియోలజీ, వైద్యుల పోస్టులకు అక్టోబర్ 8న నోటిఫికేషన్ ఇచ్చారు. కలెక్టర్ అనుమతితో రూ.2 లక్షలు ఇస్తామని చెప్పారు. కానీ ఎవరూ రాలేదు. కలెక్టర్, మేము చాలా ప్రయత్నిస్తున్నాము.

– ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్

డీఎంఈకి తెలియజేశాం..



జిల్లా ఆస్పత్రుల్లో నాలుగు నెలలుగా స్కానింగ్ బంద్‌లో ఉంది. ఆగస్టులో రెడియాలజిస్టులు, వైద్యులు బదిలీ కావటం వల్ల ఈ సమస్య వచ్చింది. కొత్త వారి కోసం నోటిఫికేషన్ ఇచ్చాము. ఇంకా ఎవరూ రాలేదు. గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని డీఎంఈ వాణి దృష్టికి తీసుకెళ్లాము. నియామకం చర్యలు తీసుకుంటాము.

– రాధామోహన్, సూపరింటెండెంట్